


కూటికి లేనివాడు కొండ ఎక్కాలనున్నాడు. కోటికి పడగ ఎత్తాలని కాదు. కోరికలు విన్నవించుకుందామని కాదు. చేసిన నేరాలు చెప్పుకుని చెంపలు వేసుకుందామని. కొండమీద కోటి ప్రభల వైభవమట; వేయి కళ్యాణాల వెలుగట. కన్నుమూసేలోపల కళ్లారా చూసి తరిద్దామని. మరుగున మనుగడ సాగి




# నాన్యః పంథా

ధ్యానుని ఏడు కొండల వెనక వెలిశాడు. వెలిసిన వాడి దురదృష్టం—వెతికి వెతికి పట్టుకున్నారు జనం. రచ్చకెక్కించారు. రూకలు ఇస్తేనేగాని రూపు కనుపించడు. పైసలు పారవేస్తేనేగాని ప్రసాదం అందదు. అట్లా అమ్ముడు పోతున్నాడు.

'అలివేలు మగడా! ఎంత కర్మ పట్టిందిరా!' అనుకున్నాడు. ఆగి పరకాయించి చూచాడు. అల్లంత దూరాన ఎవ్వరూ లేరు. పక్కన చెట్టుపంచన కూర్చున్నాడు. మోటారు బళ్ళు పడ్డ తరవాత కాలిబాటమీద రద్దీ తగ్గింది. ఒంటరిగా ఏక బిగువున నడవాలంటే విసుగు పుడుతుంది. 'అంజనా దిగువ పట్టణాలూ, పల్లెలూ ఇన్ని ఉండగా, అలనా, పాలనా లేనట్లు ఇక్కడ వెలివేశావేమయ్యా వెంక టేశ్వరా! దేవుళ్ళకు వెలవడం తప్పదు. మాకు కొలవడం తప్పదు. సరే, పద. ఇంకెంత కాలంలే. ఏ కొలువు వ్యాపార సరళికి వచ్చింది. ఈరోజుల్లో అన్ని వ్యాపారాలు అడుగంటుతున్నాయి. ఇదంతా నాకెందుకులే. నేను ఉంటానా పెడతానా? రేపో మాపో రాలిపోయేవాణ్ని. నువ్వే చూస్తావుగా?'

ఇంకా చూపు తగ్గలా. వచ్చేది తిరుపతయ్య లాగున్నాడు. వీడి దుంపతెగ! నడిచి వస్తున్నాడే, హాయిగా అందలమెక్కి పోలేక.

"ఓ తిరుపతయ్యా!"

"............."

"పలకవేమయ్యా? నిన్నేనయ్యా!"

". . . . . . . . . ."

"ఓ కోపటయ్యా! చెముడు వచ్చిందనుకుంటానే."

"పుట్టిన దగ్గర నించీ ఉందిలే కొంచెం."

"పరవాలేదులే. ఎంత సత్తెంగల దేవుడైనా పలకరించడుగా! కంటిచూపు ఉంటే చాలు కొలుచుకు రావచ్చు. తోడు దొరికావు. సరే, నడు."

తిరుపతయ్యకు వీణ్ణి ఎప్పుడూ చూసిన గుర్తు లేదు. ముడుపు చెల్లించాలని ముల్లె పట్టుకు వస్తు న్నాడు. ముందూ వెనకా చూసి మూట దింపమంటే! కాదంటే పీక పిసికితే? వెంకన్న ముడుపు మూల కడు చెల్లించుకుంటాడా! ఛీ! వెధవ ఆలోచన. చెంపలు వేసుకున్నాడు, ఎందుకైనా మంచిదని.

"నేను ఎరికేనా?"

"ఎంతమాట! ఎరిక లేనివాణ్ణి ఎలుగెత్తి పిలు స్తానా? నువ్వూ నేనూ ఆ స్వామికి ఎరికే. చెబు తానువిను. మీది సింగారం కాదూ? నాగులేరు ఒడ్డున."

"అవును. చిల్లర దుకాణం."

"వినాయక చవితినాడు వెయ్యి తులాల బంగారం పోలా?"

"ఆఁ"

"బావమరిది దొంగిలించాడని పుకారుపుట్టలా!"

"ఊఁ"

"వాడిమీద పోలీసు రిపోర్టు ఇస్తే ఇంట్లో నించి లేచిపోతానంది గదూ నీ ఆవిడ?"

**సరళ రేఖ కనక అందరికీ సరళంగానే కనిపిస్తుందని నమ్ముతారు. అది కేవలం వక్ర రేఖగా మాత్రమే కొందరికి కనిపిస్తుంది. అలాగే మంచి చెడులు, పాపపుణ్యాలు, అన్నీను. దొంగతనం పాపమా, పుణ్యమా? అంటే అవును, కాదు అని చెప్పడం ఎంత కష్టమో విజ్ఞులయినవారికి అనుభవైక వేద్యం.**

"అందిలేవయ్యా. దాని ఊసు నీకెందుకు? అసలు సంగతి చెప్పు."

"ఆఁ మా ఇంట్లో పనిచేసేది, మంగమ్మ. దాని మరిదివయ్యా."

"తప్పాదియ్యా! చెప్పవూ? పోయిన సంగతి బయటికి పొక్కలేదు. ఇంత లోగుట్టు చెప్పావంటే కన్నం నువ్వే వేసి ఉంటావు."

"విప్పి చెబుతున్నాగా? వేసింది నేనే. వెన్న దొంగిలించినవాడికి, వేణుగోపాలుడికి వేడుకలు చేయించా. మిగిలింది అన్న కూతురికి ఇచ్చి అత్తవారింటికి పంపా. ఇవన్నీ విన్నవించుకుందామనే వెంకటేశ్వరుణ్ణి చూద్దామని పోతున్నా. ఓ కోమటయ్యా, ఒకటి చెబుతాను విను. వెన్న, చీరలు దొంగిలించిన వాడు, గొల్లపిల్లలను ఆటకాయించినవాడు ఆ నల్లనయ్య దొంగ అంటావా! దుండగీడంటావా!"

"ఛీ రామ రామ! ఎంతమాట!"

"కన్నాలు వేశానుగాని, కడుపు నింపుకున్నానా? లేదన్నవాడికి కాదనకుండా ఇచ్చా. కళ్యాణాలు చేయించా. అందువల్లే ఆ అయ్య చలవ వల్ల అప్పటికి ఇప్పటికి సర్కారువారికి చిక్కలేదనుకో."

వీణ్ణి చూడగానే తిరుపతయ్యకు అనుమానం వచ్చింది. దొంగ రంగడని తెలియగానే భయం వేసింది. కోమటిబిడ్డ. బ్రతకనేర్చినవాడు. దొంగకు తాళం చెవులు ఇస్తే దోచుకుపోడని సామెత. అందుకనే దాచకుండా చెప్పడం ప్రారంభించాడు.

"అన్నా, రంగన్నా. మా ఊరివాడివి. దాచకుండా చెబుతున్నా. కొండ ఎక్కి దిగేంతవరకూ కలిసి మెలసి ఉందాం. పోయినదానికి నాకు దిగులు లేదు. ఉన్నది మిగిలితే చాలు."

"అంతేలేవయ్యా."

"ఆఁ ఆరోజు బంగారం పోయిందా? మర్నాడు నాగులేరుకి వెళ్లి నీట మునిగి మొక్కుకున్నానయ్యా. ఏమని? వెంకటేశ్వరా! అంతకు మరింత ఇస్తివా అందులో సగం ఇస్తానన్నా. ఇక చూసుకో. నా సామి రంగా! వ్యాపారం ముమ్మరమయింది. అనుకున్నంతా వచ్చింది. అందులో సగం ఇద్దామని మూట కట్టుకు వచ్చా. ఉన్నమాట చెప్పొద్దూ! స్వామికి అందేవరకూ నీవే అండ" అన్నాడు. రంగడు "ఊ" కొట్టి ఊరుకున్నాడు.

"మరోమాట. కొండమీద నీ ఖర్చు అంతా నాదే. నా వెంట ఉండు. కొండమీద కూడా దొంగలు ఉంటారని వినికిడి. ఒకడికి ఇద్దరు ఉంటే మంచిది."

రంగడు మరోసారి "ఊ" కొట్టాడు. ఇద్దరూ నడిచి నడిచి కొండమీదికి చేరుకున్నారు. అప్పుడే స్వామివారికి మేలుకొలుపు సాగుతూంది. ఆయనకు కన్నారా నిద్రపోయే యోగ్యత లేదు. వేకువనే కళ్ళు నులుముకుంటూ లేవవలసిందే. ఆయనతో పాటు, సుప్రభాతం వినిపించగానే భక్తులందరూ లేవడం, కోనేటిలో స్నానం చెయ్యడం, మొక్కుకున్న రీతిని ముడుపులు చెల్లించుకోవటం, ముండనం చేయించుకోవడం ఇత్యాది ప్రతిరోజూ ఒక పరిపాటి. స్వామివారి క్షేత్రం ఎప్పుడు చూచినా కిటకిటలాడిపోతూ ఉంటుంది. కన్నుల పండువుగా ఉంటుంది. వచ్చిన వారందరూ ఆయన పేరుమీద కాస్త కూస్త మొక్కుకున్నవాళ్లే. ఆయన పట్టించుకోనివాళ్ల పళ్లు పటపట కొరక్క పోయినా ఉన్న చోటునుండే దండాలు పెడతారు మరోసారైనా పరకాయిస్తాడని. రంగన్నకు మొక్కులు లేవు. ముల్లె లేదు. చుట్టపు చూపుగా చూసి పోదామని వచ్చాడు. మనిషి అయిన తరవాత, మాయ, మర్మం తెలిసిన తరవాత భగవంతుడంటే కాస్త భయం భక్తి ఉండాలి. తెలిసిన దేవుళ్లకు చేతులు కట్టుకుని సాగిల పడాలి. చూచిన దేవాలయాల చుట్టూ తిరిగిరావాలి. మరి ఎంతమంది దేవుళ్లు లేరు? దేవతలు లేరు. పుట్టచెట్టు దగ్గిరనుంచి లెక్క పెట్టుకుంటూ వస్తే మన మతంలో జమకట్టడానికి వీలులేనంత మంది దేవుళ్లు ఉన్నారు. అయితే ఈ స్వామికే ఎందుకు చెప్మా ఇంత హంగామా? తరతమాలు దేవుళ్లకు కూడా ఉన్నాయేమో? విజయనగర సామ్రాజ్యంలో విరూపాక్షుడు అందరికన్న మిన్నగా పూజింపబడ్డాడు. కాకతీయులు మరో దేవతను, చాళుక్యులు మరో దేవుణ్ణి మిన్నగా చూచారు. మానవ మాత్రులు పదవులకు గాని పరువానికి గాని ప్రమాదం సంభవించే తరుణంలో స్వామివారిని అర్చించడం, అక్కడ రెండు రోజులు మకాం చెయ్యడం పరిపాటి. పెద్ద పదవులు అనుకోకుండా రాగానే/ముందుగా స్వామిని సేవించి తరవాత గద్దె ఎక్కడం ఒక సంప్రదాయంగా పరిణమించింది. నాయకులు క్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి ఇక్కడికి రావడం కద్దు. నిజం చెప్పాలంటే వెంకటేశ్వరుడు ఆంధ్ర ప్రభుత్వానికి, ప్రజలకు ఆరాధ్యదైవం.

రంగడు తల పైకెత్తి చూశాడు. దేవాలయం శిఖరం దేదీప్యమానంగా వెలిగిపోతూంది. అంతా బంగారు తొడుగు. తొడుగుమీద సూర్య కిరణాలు పడి కళ్లు మిరుమిట్లు గొలుపుతున్నాయి.

"ఆహా ఏం వైభవంరా! వెంకటేశ్వరా! దీపారాధనలేని దేవాలయాలు ఎన్ని లేవు! కరణంగారి ఇంట్లో కన్నం వేసిన సొత్తు నాగులేరు ఒడ్డున నాగేశ్వరస్వామి ఆలయంలో చీకటి గుయ్యారంలో దాచాను ఆరోజు. తప్పాదియ్యా, ఇంత పట్టపగలుగా ఉంటే ఆరోజే పట్టుకు వెళ్ళేవారు నన్ను పోలీసులు. వెన్నకాచినవాడికి నూనె కరువుకానా, ఛీ అనుకున్నా. పక్కఊరు బాపనయ్యను పిలిచి, సంతరించినదానిలో సగం ఇచ్చా. నివేదనా, ఆరాధనా జరిపించమన్నాను. నాటినుంచి నేటివరకూ నాగేశ్వరుడు వెలిగిపోతున్నాడనుకో. నీ పేరు విన్నాను. ప్రతీతి విన్నాను. నమ్మకం చిక్కలా. నేనే తెలుసుకుందామని వచ్చా."

**తల్లావఝ్ఝల సరోజిని**

తిరుపతయ్య వెన్నున చరిచాడు. రంగడు మన లోకంలోకి వచ్చాడు. "పదవయ్యా, ముండనం చేయించుకుని మునకవేసి దర్శనానికి పోదాం" అన్నాడు తిరుపతయ్య.

రంగడు ఆలోచనలో పడ్డాడు. "నెరిసిన జుట్టూ, మాసిన గడ్డం స్వామికి ఇస్తానా? ఛీ ఆయనకు పరువు తక్కువ కాదూ! అయినా, గడ్డం తీస్తే దొంగముఖం బయటపడుతుంది. ఆ ముఖం పెట్టుకుని స్వామిని చూడనా! నాకుమాత్రం చిన్నతనం కాదూ! నువ్వు పోయిరా. నేను కోనేటి ఒడ్డున ఉంటా" అంటూ జవాబు ఆశించకుండానే రంగడు బయలుదేరాడు. ధర్మదర్శన సమయం. దారి పొడుగునా రద్దీగా ఉంది. అందరూ క్షురకర్మ చేయించుకుని చేతులు పైకెత్తి "వెంకటేశ్వరా! గోవిందా! గోవిందా!" అనుకుంటూ పోతున్నారు. అసలే సన్నని సందు. అందులో సగభాగం బిచ్చగాళ్లు ఆక్రమించుకుని కూర్చున్నారు. జనం కిక్కిరిసి తోసుకుంటూ పోతున్నారు. రంగడు ముందుకు నడవలేకపోయాడు. పక్కన కూలబడ్డాడు.

'అనేక సంబరాలు చూశా. సంతలు చూశా. తిరణాళ్లు చూశా. ఓ రయ్యో! ఈ రద్దీ తొక్కిడి నేచూడలా!' అనుకుని ఆశ్చర్యంగా జనప్రవాహం వంక చూస్తూ కూర్చున్నాడు. పక్కనున్న బిచ్చగాడి పళ్లెం వంక చూచాడు. పది పయాపైసలు కూడా లేవు. ముక్కుమీద వేలు వేసుకున్నాడు.

"అన్నా, స్వామి వెలిసిన దగ్గిర నుండీ ఇక్కడే ఉన్నావా?"

"నేను పుట్టిన దగ్గిరనించీ."

"రోజుకి రూపాయన్నా రాలేదా?"

"ఏం? నువ్వుకూడా మకాం వేద్దామనుకుంటున్నావా?"

"కాదన్నా, అంతపని తలపెట్టనులే. ఉబుసుపోక అడుగుతున్నాను."

"నువ్వు చూస్తూనే ఉన్నావుగా? ఇదీ, ఇంతవరకూ రాలింది."

"ముందు స్వామికి అరగింపు. తరవాత మనకి. ఇది రివాజు. ఇందువల్ల పైకివెళ్లేవాడు పైసా రాల్చకపోయినా బాధ పడక్కరలేదు."

"నీమాటే ఒప్పుగుంటా పోనీ, దర్శనం చేసుకుని తిరిగి వచ్చేవాడు రెండు పైసలు విసరవచ్చుగా?"

"అదీ నిజమే అనుకో. కాని ఉన్నదంతా హుండీలో ఊడ్చిపెట్టి వట్టి చేతులతో వచ్చేవాడు నీకేమి[illegible]డు?"

"కొంచెం మిగల్చకూడదూ?"

"ఎంతమాట! స్వామి ఏలుబడిలో బ్రతుకుతూ ఆయనకు ఎగనామం పెట్టాలని కోరుకుంటానేమయ్యా? స్వామి చల్లగా ఉండాలని కోరుకో. ఆయనే చూస్తాడు అంతా [illegible]" అంటూ

రంగడు బయలుదేరాడు. కోనేరు చేరుకున్నాడు. సంచీ సరంజామా పక్కనపెట్టి, నీటిలోకి దిగాడు. ఎదురుగుండా గట్టుమీద ఎరిగిన ముఖం కనిపించింది. పదహారేళ్ల పడుచు. పారాణి రాసుకుంది. పమిట ముసుగు వేసుకుని నీళ్లలోకి తొంగి చూస్తాంది. ఎందుకో ముందు, వెనక పరకాయించి చూస్తాంది. ఎక్కడలేని ధైర్యం కూడ గట్టుకుంటున్నది. చలికాలం కాదు చన్నీటి స్నానానికి భయపడటానికి. అసలు స్నానానికి వచ్చిన వాలకం లేదు. వెంట మరొకడు లేడు. రంగడికి అనుమానం వేసింది. ఆదుర్దా ఎక్కువయింది. 'కోనేటిలో పడి కన్నుమూస్తే, స్వామి క్షేత్రానికి అపనింద కాదూ!' అనుకున్నాడు. ఒక్క మునుగు మునిగాడు. వెంటనే అమ్మాయి దగ్గర తేలాడు.

"అమ్మీ, నీ పేరు కమలమ్మకాదూ? కరణంగారి కూతురువి. అవునా?"

"ఆఁ." విసుగ్గా సమాధానం చెప్పింది.

"నిన్ను చూసిన దగ్గర నించీ ఆలోచిస్తున్నా, ఎక్కడ చూశానా అని. ఇప్పటికి గుర్తు వచ్చింది. సరేగాని చాలాసేపటినించి ఇక్కడే కూర్చున్నావు దేనికి? స్నానం చేశావా?"

"ఆఁ." మరొకసారి విదిలించింది.

"మాది మీ ఊరి పక్క ఊరేలే. రంగాపురం. నాగులేరు ఒడ్డున."

"మరి నన్ను ఎక్కడ చూశావు?"

"ఏ సంవత్సరమో గుర్తు లేదుగాని, కార్తీక సోమవారంనాడు మీ యింట్లో దొంగలు కన్నం వెయ్యలా? ఉన్న బంగారం అంతా దోచుకుపోలా? గుర్తుందా? అప్పుడు నీకు పదేళ్లు కూడా లేవనుకుంటాను. పట్టెమంచమీద పడుకుని ఉన్నావు."

"వాళ్ల దుంపతెగ! వాళ్లమూలంగా తలపెట్టిన పెళ్ళి ఆగిపోయింది. వాళ్లకూ బిడ్డలుంటే తెలిసేది కష్టం. గొడ్డుమోతు ముండాకొడుకులు."

రంగన్నకు గుండెల్లో బాకు పొడిచినట్లయింది. బాధ బయటకు కనబడకుండా—

"ఏమయింది? పూర్తిగా చెప్పు" అన్నాడు.

"చెప్పుగుని లాభంలేదు తాతా! తెగతెంపులు చేసుకుని నిలువునా దూకి చావవలిసిందే." వెక్కి వెక్కి ఏడుపు ప్రారంభించింది.

"ఇదుగో, నీ ఎదురుగుండా ఎవరున్నారో తెలుసా? వెంకటేశ్వరస్వామి. ఆయన తలుచుకుంటే కళ్యాణాలు ఆగిపోతాయా! నామాట విను, చెప్పు."

"అయితే విను. నువ్వు చెప్పావే. ఆబంగారం మానాన్న నాపెళ్లికని కూడ బెట్టాడు. ఎవరి కొంపలు తియ్యలా. అమ్మ నగలు, అత్తవారిచ్చిన నగదు కలిపి కూడబెట్టాడు. నేను ఒక్కదాన్నేగా? కూడబెట్టి ఇద్దామనుకున్నాడు. ఇట్లా ముంచుకు వస్తుందని ఎరగడు."

"దొంగకు మాత్రం ఏం తెలుసు? సరే, కానీ." నిట్టూర్పు విడిచాడు.

"దాచుకోడం తెలుసు. దుర్వినియోగం చెయ్యడం తెలుసు. వాడు మాత్రం మనిషి కాడూ! జాలి ఉండక్కర్లా?"

"ఇంత లోతుగా ఆలోచించాడా ఆ వెధవ సన్యాసి? నువ్వు వట్టి అమాయకురాలివి. ఊఁ కానీ."

"మరో మార్గంలేక మేనరికం కుదిర్చాడు.



మహాబలిపురం శిల్పసంపద ఫోటో—శ్రీమతి ఇ. తుర్ బేగం (ఆదోని)

కట్నాలు కానుకలు వద్దు. కమలమ్మ మెళ్లో ఇరవై తులాల బంగారం వెయ్యమంది మా అత్త. మానాన్న సరేనన్నాడు. అనుకున్న ప్రకారం ఇరవై తులాల నగలూ చేయించాడు. చేత పుచ్చుకుని ఇక్కడికి వచ్చాం."

"బాగానే ఉంది. అనుకున్న ప్రకారం చేశాడుగా?"

"ఆగు తాతా! ఇక్కడే వచ్చింది రగడ. మా అత్త నగలు చూచింది. కళ్లు చిట్లించింది. పదునాలుగు వన్నెలంది. పనికిరావంది. పెండ్లి జరగదంది. అంతే. ఇటు వచ్చా..."

"పదునాలుగు వన్నెలు!" ఆశ్చర్యంగా అన్నాడు.

"అవును తాతా, సర్కారువారి హుకుం. మా నాన్నమాత్రం ఏం చేస్తాడు?"

"ఏమోలే. నేను బంగారం చూచి, తాకి చాలా కాలమయింది. మేలిమి బంగారం దొరకడం లేదన్నమాట! అబ్బ. ఆరోజుల్లో.." వెంటనే ఆగిపోయాడు.

"పారాణి పూసిన తరవాత పట్టుచీర కట్టిన తరవాత, కళ్యాణం బొట్టు దిద్దిన తరవాత, ఛీ బంగారం చెరపడం మా యింటా వంటా లేదు. మా నాన్నపేరు పోకూడదు. నా పరువుకు చేటు రాకూడదు. అందుకనే ఇక్కడికి వచ్చా."

"ఇంత చిన్నదానికి ఎంతపని తలపెట్టావు? అయితే సరేగాని, నాకో సంగతి చెప్పు. హుండీలో పడేదంతా పదునాలుగు వన్నెలేనా?"

"నాకుమాత్రం ఏం తెలుసు? ఆ స్వామికే తెలియాలి."

"అంతేలే. ఎవడేమి వేస్తున్నాడో ఎవరికెరుక! సరేలే. లే. పోదాం."

"ఎక్కడికి తాతా?!"

"కళ్యాణానికి. నేను ఉండగా నీకు చేటురానా? నేను దగ్గిర ఉండి తాళి కట్టిస్తానమ్మా."

"మా అత్త గట్టి పిండం. గండ పెండేరంలాంటి మనిషి. మాటలతో వినే మనిషి కాదు. మానాన్న ఎన్ని చెప్పాడు. కాళ్ళావేళ్ళాపడ్డాడు. ఉహూఁ సేమిరా కాదంది.

మానాన్న అవస్థ చూస్తే గుండె తరుక్కుపోతూంది."

"మా పక్క ఊరి ఆడపడుచు కంట నీరు పెట్టకూడదు. దొంగలకు నీ ఉసురు తగలకూడదు. చోరులంతా వేణుగోపాలుని సంతతివారమ్మా. ఈమాట గుర్తుంచుకో. నడు."

"రాను తాతా! నా పరువు దక్కదు. నన్ను చావనీ."

"వెంకన్నమీద ఒట్టు వేస్తున్నా. మీ అత్తకు మేలిమి బంగారం ఇస్తా. నీ పెళ్ళి చేయిస్తా. నామాట నమ్మనివాడు నాగులేరు ప్రాంతంలో ఒక్కడూ లేడు. తెలిసిందా? ఇక నడు" అన్నాడు.

అమ్మాయికి నమ్మకం కుదిరింది. వెంట తీసుకు పోయింది. బస చూపించింది. తండ్రి గుమ్మంమీద తలమోపి కూర్చున్నాడు. కంట నీరు పెట్టుకుంటున్నాడు. గుమ్మానికి పెట్టిన కుంకుమ కన్నీటికి తడిసి కరిగిపోతూంది. మామిడాకు తోరణాలు నీరసంగా గాలికి ఊగుతున్నాయి. ఆ దృశ్యాన్ని చూచేటప్పటికి రంగన్నకు జాలివేసింది. కళ్ళు చెమ్మగిల్లినాయి. "మళ్ళావస్తాను" అని సమాధానం ఆశించకుండా వెళ్ళిపోయాడు. తిరిగి కోనేరు చేరుకున్నాడు. నీటిలో మునకవేసి స్నానం చేశాడు. స్వామి దర్శనానికి బయలుదేరాడు. జనం రద్దీలో తోసుకుంటూ తప్పించుకుంటూ వెళ్లేసరికి ధర్మదర్శనం అయిపోయింది. దర్శనం అందని భక్తులందరూ ముఖాలు వేళ్లాడేసుకుని తిరిగి వస్తున్నారు. వాళ్ళను చూసి ఇక వెళ్ళినందువల్ల ప్రయోజనం లేదనుకున్నాడు. హుండీదగ్గిర నిలబడ్డాడు. పరకాయించి చూశాడు. హుండీ బరువుగా వేళ్ళాడుతూంది. నవమాసాలు నిండిన గర్భిణీస్త్రీలా ఉంది. చుట్టూరా పోలీసులు కాపలా ఉన్నారు. హుండీలోకి తొంగి చూడబోయాడు. పోలీసులు హుంకరించారు. మనకెందుకులే అనుకున్నాడు. ప్రాకారంలోని మంగోపురం చూసుకుంటూ నడుస్తున్నాడు. ఒకచోట స్వామివారు సంపాదించినదంతా లెక్కపెడుతున్నారు. జమ కడుతున్నారు. బంగారం తూస్తున్నారు. నోట్లు కట్టలు కడుతున్నారు. దగ్గిరికి వెళ్ళాడు. తనంతవాడే ఉన్నాడు.

"ప్రతిరోజూ ఇంత రాలుబడి ఉంటుం[illegible]

ఆంధ్రప్రభ
సచిత్ర వార పత్రిక
చందాదారులకు
విజ్ఞప్తి

చందాదారులకు పోస్టులో ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక ప్రతులు ప్రస్తుతం మద్రాసునుంచే పంపుతున్నామని ప్రకటించడానికి ఆనందిస్తున్నాము. పోస్టుద్వారా ప్రతులు పొందగోరే పాఠకులు, చందాదారులు తమ చందా మొత్తాలను లోగడవలె విజయవాడకుకాక ఈ దిగువ చిరునామాకు పంపాలని కోరుతున్నాము.

సర్క్యులేషన్ మానేజరు
ఆంధ్రప్రభ లిమిటెడ్
డైరెక్టర్స్ ఆఫీసు
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మౌంట్‌రోడ్
మద్రాసు–2

మానేజరు

మొటిమలు
మాయమగును
చర్మము మృదువుగా శుభ్రపడును

నిక్సొడెర్మ్ (NIXODERM)ను రాసినచో మొటిమలు మాయమగును. నేటి రాత్రి నిక్సొడెర్మ్ (NIXODERM) వాడి చూచినచో చర్మము మృదువుగాను, నాజూకుగాను శుభ్రపడుటను గమనించగలరు. మొటిమలు, కురుపులు, ఎర్రని మచ్చలు, దురద, కామెర మొదలగువాటికి కారణభూతమగు క్రిమి జాలమును శాస్త్రోక్తముగా తయారైన నిక్సొడెర్మ్ (NIXODERM) సంహరించును. చర్మపురంధ్రములలో దాగియుండు వేరువేరు క్రిమి జాలమును తొలగించని ఎడల మీ చర్మ వ్యాధులు నివారించవు. మీ మొటిమలను నిర్మూలముగా తొలగొట్టి చర్మమును మృదువుగాను, నాజూకుగాను శుభ్రము చేయు నిక్సొడెర్మ్ (NIXODERM)ను నేడే మీ కెమిస్టు వద్ద కొనండి.

## నాన్యఃపంథా

అన్నాడు.

"నిత్యమూ ఉంటుంది."

"మేలిమి బంగారం?"

"అదే ఎక్కువగా వస్తుంది."

"మరి సర్కారువారి ఉత్తరువు?"

"స్వామి అన్నిటికీ అతీతుడయ్యా!"

"అవును. కల్తీ వస్తువు స్వామి కైంకర్యం చెయ్యకూడదు."

*కొంతధైర్యంచిక్కింది. కొండమీద మేలిమిబంగారం* దొరకవచ్చు ననుకున్నాడు. కాని మేలిమి బంగారం దగ్గిర ఉన్న భాగవతోత్తముడు కనిపించాలి. వాడికోసం వెతకాలి. భగవంతుడు లాగే పరమభక్తశిఖామణులు సామాన్య మానవులకు కనిపించరు! వెదికి పట్టడం చాలా కష్టం. పైపెచ్చు అటువంటివారిని పరమేశ్వరుడు అహర్నిశలు కాపాడుతూనే ఉంటాడు! తప్పాదియ్యా. ఇక్కడ అందరూ ఒకటిగానే కనిపిస్తారు. ఉన్నవాడెవడో, లేనివాడెవడో తెలియదు. అందరూ పసుపు గుడ్డలతోనే మూట కడతారు. లోపల ఏముందో ఎడికెరుక? ఆట కాయించి మూట విప్పితే? అదృష్టం బాగుంటే ఆభరణాలు ఉండచ్చు. లేకపోతే అహర్నిశలు వ్రాసిన రామకోటి పుస్తకం ఉండవచ్చు. ఆలోచనలతో రంగడి బుర్ర తిరిగిపోతూంది. కాలం గడుస్తున్న కొద్దీ ఆరాటం ఎక్కువై పోతూంది. తలపెట్టింది కల్యాణం. తంటాలు పడి చేయించాలి. లేకపోతే ఆడకూతురు ఉసూరుమంటుంది. 'ఈ వయస్సులో ఎంత అవస్థ తెచ్చిపెట్టావురా వెంకటేశ్వరా!' అనుకున్నాడు. గోపురానికి వంగి దణ్ణం పెట్టాడు. ఏదో ఆలోచన మెరుపులా వచ్చింది. తొందరగా అడుగులు వేసుకుంటూ నడవడం ప్రారంభించాడు. తిరుపతయ్య తలకాయ వంచుకుని ఎదురుగా వస్తున్నాడు. తలకాయ నున్నగా చేయించుకున్నాడు. నామం పెట్టాడు. రంగన్నను చూడకుండా నడిచి పోతున్నాడు.

'ఓ తిరుపతయ్యా, ఆగవయ్యా."

ఆగాడు.

"దర్శన మయిందా?"

"ఉహూ. స్వామిని చూడాలంటే ఎంత కష్టపడాలి! రెండు మెతుకులు తిందామని పోతున్నా. నువ్వు కూడా రా."

"నేను ఒంటి పొద్దులే. సరేగాని, తిరుపతయ్యా, ఎంత ఘోరం జరుగుతూందో చూశావా! హుండీలో పడేదంతా కల్తీ బంగారమే! నా కళ్ళారా చూశా."

"పోనీవయ్యా. ఎవరి పాపాన వాళ్ళే పోతారు. మనం సత్యంగా ఉందాం."

"అంతేలే. నేను వస్తా" అంటూ వెళ్ళిపోయాడు.

అనుకున్న ముహూర్తానికి కమలమ్మ పెళ్ళి జరిగిపోయింది. ఆడకూతురుకు కన్నెచెర వదిలింది. అత్త సంబరానికి హద్దులేదు. కన్నతండ్రి ఆనందపరవశుడయినాడు. తాళి కట్టడం పూర్తి కాగానే కమలమ్మ పరిగెత్తుకుంటూ రంగన్న దగ్గిరికి వచ్చింది. రంగన్న గోడ నానుకుని కూర్చున్నాడు. వాడి కళ్ళలో తృప్తి, సంబరం రెండూ తొణికిసలాడుతున్నాయి.

"తాతా! ఆపదలో ఆదుకున్నావు. నన్ను ఒక ఇంటిదాన్ని చేశావు. నా పరువు కాపాడావు. నీ ఋణం ఎట్లా తీరుతుందో! నీపేరు చెప్పు. పుట్టేవాడికి అదే పెట్టుకుంటా. కడుపులో పెట్టుకునికాచుకుంటా. నీ బుద్ధులు నేర్పుతా."

"ఆ. నా బుద్ధులా!" నిట్టూర్చాడు.

"ఏం? నువ్వు తక్కువవాడివి కాదు. ఆ స్వామితో సమానమైనవాడివి."

"సరేలే. నువ్వు వట్టి పిచ్చిపిల్లవు. నేను వస్తా" అంటూ గబగబా నడిచి వెళ్ళిపోయాడు. మనస్సులోనే ఆశీర్వదించాడు.

స్వామి దర్శనానికని పోతున్నాడు. పోలీసులు వచ్చారు. చేతులకు కడియాలు వేశారు. పక్కన తిరుపతయ్య నిలుచున్నాడు. పదమన్నారు.

"ఎక్కడికి?"

"కోర్టుకు."

"స్వామి క్షేత్రంకన్నా మరో కోర్టు ఉందా? నిజం చెబుతా, వినండయ్యా. తిరుపతయ్యా, వయస్సుమళ్ళింది గాని బుద్ధి మారలా. చేతివేటు ఒడుపు సన్నగిలలా. నీ స్వామి ముడుపు నేనేనయ్యా కైంకర్యం చేసింది" అన్నాడు.

తిరుపతయ్య పళ్ళు పటపట కొరుకుతూ నిలుచున్నాడు. కళ్ళవెంట నిప్పులు కురుస్తున్నాడు.

"జైల్లో పెట్టండి. దొంగ ముండాకొడుకు! నమ్మి నిజం చెబితే నాకొంపే ముంచాడు. ఇది రెండోసారి. నరికినా పాపం లేదు."

"నడు" అంటూ పోలీసులు ముందుకు ఒక్క తోపు తోశారు. పడబోయి పళ్ళబిగువున నిలదొక్కుకున్నాడు.

"ఈ వయస్సులో ఎంత శిక్ష విధించావురా! వెంకటేశ్వరా! దొంగిలించింది దొమ్మరిదాని కిచ్చానా? తాగి తందనాలు తొక్కానా? ఆడకూతురుఉసురు నీకు తగులుతుందని నీ అండ చూచుకుని కళ్యాణం చేయించా! కాళ్ళకు సంకెళ్ళు వేయించావు. దిగువున ఉన్న దేవుళ్ళ నిజాయితీ నీకు లేదురా! నీవే దిక్కని మొక్కి సాగిలపడితే ఇదా చేసింది? నాగులేరు ప్రాంతాన వెన్నుకాయని దేవుడు లేడురా! వాళ్ళకంటే మొనగాడివని నీ దగ్గిరికి వచ్చా. రూపు చూపక పోయినా బుద్ధి చూపించావు! బ్రతికి బాగుండి బయటపడితే వివరంగా విన్నవిస్తాను."

మరో తోపు తోశారు పోలీసులు. నిలదొక్కుకోలేక నేలమీద పడ్డాడు. మిగిలిన రెండు పళ్ళూ రాలిపోయినాయి. నోటివెంట రక్తం వస్తూంది. తెల్లని గడ్డం రక్తంతో తడిసి పోయింది. లెక్క చెయ్యకుండా పోలీసుల వెంట నడిచి వెడుతున్నాడు.

కమలమ్మ భర్త వెంట బస్సులో కొండదిగి అత్తవారింటికి వెళ్ళిపోతూ తాతను చూచింది. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. "తాతా" అంటూ అరిచింది. భర్త కమలమ్మను ఒరిగి పోకుండా పట్టుకున్నాడు.

రంగన్న తల పైకెత్తలేదు. కమలమ్మ అరుపు విన్నాడు. కళ్ళ నీళ్ళు పెట్టాడు. పోలీసులు వెంటరాగా వచ్చినదారినే కొండదిగి వెళ్ళిపోయాడు.

స్వామివారి కొలువు వైభవంగా సాగుతూనే ఉంది, నాటికి నేటికి. రంగన్న జాడ లేదు. ఏ దేవుడు కనికరించాడో, ఎక్కడ లీనమయ్యాడో ఎవరి కెరుక? ★